ఈనాడు విజయనగరం

మంగళవారం అక్టోబరు 22, 2024

> గుర్ల ఘటన నన్ను ఎంతో కలచి వేసింది. జలాలు కలుషితం కావడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఫలితమే ఇది. అలా గని వారిపై తప్పును నెట్టేసి బాధ్యతల నుంచి తప్పుకోం. సమస్యలను సవాళ్లుగా స్వీకరించి, పరిష్కరిస్తాం. రాష్ట్రంలో అనేక చోట్ల ఈ సమస్య ఉంది. ప్రజలందరికీ శుద్ధి చేసిన తాగునీరు అందిస్తాం

గుర్ల ఘటన కలచి వేసింది

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



రోగి పరిస్థితిపై ఆరా తీస్తున్న పవన్ కల్యాణ్

గుర్ల, గరివిడి, చీపురుపల్లి, విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గుర్లలో అతిసారంతో ఇబ్బంది పడుతున్న బాధితులు, సంబంధిత కుటుంబ సభ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. సోమవారం విశాఖ నుంచి రోడ్డు మార్గంలో విజయనగరం మీదుగా గుర్లకు చేరుకున్న ఆయన ముందుగా సొలిపి సోమరాజుపేట(ఎస్‌ఎస్‌ఆర్. పేట) వద్ద చంపావతి నదిలో ఉన్న రక్షిత నీటి పథకాన్ని పరిశీలించారు. నీటి శుద్ధి, సరఫరా తీరును కలెక్టర్ అంబేడ్కర్, గ్రామీణ నీటి సరఫరాశాఖ అధికారులు వివరించారు. అనంతరం గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి, సేవలపై వైద్యులను ఆరా తీశారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు.

కలుషిత నీరే కారణం..

ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. నీటి సరఫరాలో లోపాలు, అధ్వాన పారిశుద్ధ్యం గురించి వివరించారు. వాంతులు, విరేచనాలతో పది మంది చనిపోయారని చెప్పారు. అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఇచ్చారని వాపోయారు. కలుషిత నీరు, అపరిశుభ్ర వాతావరణమే ప్రాణాలు తీస్తున్నాయని బోరుమన్నారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. విచారణకు సీనియర్ ఐఏఎస్ అధికారి విజయానంద్‌ను నియమించామని, నివేదిక వచ్చాక ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తూ...

గత తప్పిదాలతోనే..

గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా చంపావతి నీరు కలుషితమైందని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ఆ పరిస్థితిని మార్చుతామని, ప్రతి ఇంటికీ శుద్ధజలాన్ని అందిస్తామని చెప్పారు. విజయనగరంలోని కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో బహిరంగ మల విసర్జన ఆపాలని పిలుపునిచ్చారు. గుర్లలో కలుషిత నీరు తాగి కొందరు చనిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. తన వంతుగా ఆయా కుటుంబాలకు సాయం అందిస్తానని ప్రకటించారు.

ప్రత్యేక డ్రైవ్..

కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ఈనెల 14న తొలి కేసు గుర్తించామని, అదే రోజున నీటి పరీక్షలు నిర్వహించిన తర్వాత చంపావతి నీటి సరఫరాను, బోర్లను ఆపేసి, క్లోరినేషన్ చేసిన నీటిని అందిస్తున్నామన్నారు. అయితే అప్పటికే వ్యాధి విజృంభించిందని చెప్పారు. ఆరోజు నుంచి జిల్లా అంతటా ప్రత్యేక క్లోరినేషన్ డ్రైవ్ చేపడుతున్నామని, మరికొన్ని రోజులు కొనసాగిస్తామని తెలిపారు. బహిరంగ మల విసర్జన వల్ల కూడా నీటివనరులు కలుషితమైనట్లు భావిస్తున్నామన్నారు. గత రెండు రోజుల్లో ఎలాంటి కేసులూ నమోదు కాలేదన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, అదితి గజపతిరాజు, లలిత కుమారి, నాగమాధవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ సేధుమాధవన్ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి తెప్పోత్సవానికి ప్రాథమిక పరిశీలన

నేటి కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి



అలంకరణలో వనంగుడి అమ్మవారు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి నెలరోజుల వేడుకల్లో భాగంగా సిరిమానోత్సవం అనంతరం వచ్చే మంగళవారం నాడు తెప్పోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాన్ని దేవస్థానం ఏటా పెద్దచెరువు పశ్చిమ దిక్కున సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తోంది. నేడు అధికారికంగా జరిగే ఈ ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రాథమిక పరిశీలన నిమిత్తం సోమవారం పెద్దచెరువులో తెప్పను తిప్పారు. దేవస్థానం సహాయ కమిషనర్ డీవీవీ. ప్రసాదరావు, మత్స్యశాఖ అధికారిణి చాందిని, ఒకటో పట్టణ ఎస్సై రామ్‌గణేష్, రామతీర్థం ఈవో వై. శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ పారిశుద్ధ్య అధికారి బాలకృష్ణతో కలిపి 45 మంది వరకు భక్తులు ఎక్కి.. పరిశీలించారు. నేడు అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు మరో 15 మందే ఎక్కాలని మత్స్యశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తల్లి సేవకులు, పత్రికా విలేకర్లకు అదనంగా మరో మూడు పడవలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీ ప్రసాదరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు వనంగుడిలో వేదసభ, అమ్మవారికి పంచామృతాభిషేకాల అనంతరం ఊరేగింపుగా గాడీఖానా సమీపంలోని ఒడ్డున 5 గంటల సమయంలో తెప్పలో తల్లి విహరిస్తారన్నారు.



పెద్దచెరువులో తెప్పను తిప్పుతున్న దేవస్థానం అధికారులు, సిబ్బంది

రైతుల భూమి ఆక్రమణ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వం తమకిచ్చిన డి-పట్టా భూమిని గ్రామానికి చెందిన కొందరు దౌర్జన్యంగా ఆక్రమించి సాగుచేస్తున్నారని బాడంగి మండలం పినపెంకి గ్రామానికి చెందిన దళిత రైతులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే నంబరు 65లో పూర్వీకుల కాలం నుంచి భూములను సాగుచేసుకుంటున్నామని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ తమ వారి పేరుతోనే ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని ఆక్రమించారని, వదిలి వెళ్లకపోతే తప్పుడు కేసులు పెడతామని బెదిరిస్తున్నారని సింహాచలం, సింహాద్రిరావు, దుర్గయ్య, రాములు తదితరులు వాపోయారు.



వినతిపత్రం చూపిస్తున్న పినపెంకి గ్రామస్థులు

180 అర్జీలు.. కలెక్టరేట్‌లో జరిగిన పరిష్కార వేదికకు 180 వినతులు అందాయి. భూ సమస్యలపై అత్యధికంగా 122 అర్జీలు వచ్చాయి. పింఛన్ల కోసం డీఆర్డీఏకు 17, పురపాలక- 05, పంచాయతీశాఖ- 12, విద్యాశాఖ- 04, మిగిలినవి ఇతర శాఖలకు వచ్చాయి. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎస్.డి.అనిత వినతులు స్వీకరించారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం



అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేస్తున్న బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్

డెంకాడ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని చింతలవలస ఐదో పోలీసు బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం బెటాలియన్‌లోని స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరుల త్యాగాలను స్మరించుకునే అవకాశం దక్కడం గొప్ప అదృష్టమన్నారు. అనంతరం 31 మంది బాధిత కుటుంబ సభ్యులకు జ్ఞాపికలను అందజేశారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అదనపు కమాండెంట్ పి.సత్తిబాబు, సహాయ కమాండెంట్లు జి.వి.ప్రభాకరరావు, జి.లక్ష్మీనారాయణ, ఎస్.బాపూజీ, విశ్రాంత పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అమరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ ప్రక్రియ ఆగిపోయింది. గత ప్రభుత్వ హయాంలో రెండేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి రాష్ట్ర నిధులతో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. 25 శాతం దాటని పనులు నిలిపివేయాలంటూ పేర్కొంది. దీంతో ఆధునికీకరణపై నీలినీడలు కమ్ముకున్నాయి.

– న్యూస్‌టుడే, పాలకొండ

ఆధునికీకరణ ఆలస్యం.. అవస్థలే నిత్యం

- బకాయిలతో ఆగిన కాలువల పనులు
- నేటికీ శివారుకు చేరని తోటపల్లి నీరు



సాగునీరు పారని తోటపల్లి ఎడమ కాలువ

తెదేపా హయాంలో నిధులు..

గతంలో తెదేపా హయాంలో 2018లో ఆధునికీకరణకు రూ. 197 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో పనులు ప్రారంభించిన తరువాత వైకాపా అధికారంలోకి వచ్చింది. తొలుత 25 శాతం దాటని వాటిని నిలిపి వేయాలని చెప్పడంతో 2019లోనే ఆపేశారు. 2020లో తిరిగి ప్రారంభించారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో రబీల్లో చేపట్టారు. గత రబీలో వదిలేశారు. గుత్తేదారులకు బిల్లులు పెండింగు ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.



పాడైన మినీ షట్టరు

23 శాతమే..

పాత ఆయకట్టు కింద కుడి(17.616 కి.మీ), ఎడమ కాలువ(37.53 కి.మీ)లు ఉన్నాయి. కుడి కాలువ పరిధిలో 9.372 కి.మీ మేర కాంక్రీటు లైనింగ్ జరిగింది. ఎడమ వైపు 17.532 కి.మీ మేర చేపట్టారు. రెండింట్లో కలిపి మరో 28 కి.మీలలో లైనింగ్ నిర్వహించాలి. ఇప్పటి వరకు రూ. 41.21 కోట్ల నిధులు మాత్రమే వెచ్చించారు. ఆధునికీకరణ ప్రక్రియ 23 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు గుత్తేదారులకు రూ.18 కోట్లు అందాలి.

ముంచుకొస్తున్న గడువు..

వచ్చే ఏడాది మే నాటికి పనులు పూర్తిచేయాలి. అందులో భాగంగా వచ్చే డిసెంబరు నుంచి పనులు ప్రారంభం కావాలి. అయితే బకాయిల కారణంగా గుత్తేదారు ముందుకు రాని పరిస్థితి. మరోవైపు 25 శాతం లోపు మాత్రమే ఆధునికీకరణ జరగడం, తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

రైతుల్లో ఆందోళన

బ్రిటిష్ కాలం నాటి కాలువలు కావడంతో రూపు మారాయి. దీంతో శివారు ప్రాంతాలకు సాగునీరు చేరడం లేదు. ఆయకట్టు పరిధిలో చాలావరకు వర్షాధారమైన పంటలే ఉన్నాయి. వర్షాలు పూర్తిస్థాయిలో లేకపోవడం, మరోవైపు కాలువల ద్వారా నీరు అందకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించామని, తదుపరి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని జలవనరులశాఖ డీఈ రంగనాయకులు తెలిపారు.

కాలువల్లో ప్రజారోగ్యం

విష జ్వరాలు ప్రబలుతున్నా.. అతిసారంతో రోగులు ఆసుపత్రుల పాలవుతున్నా విజయనగరం నగరపాలిక అధికారుల్లో కదలిక రావడం లేదు. ఇక్కడ 400 కి.మీల పరిధిలో తాగునీటి పంపిణీ లైన్లు ఉన్నాయి. వాటిలో అధిక శాతం మురుగునీటి కాలువల్లోనే కనిపిస్తున్నాయి. లీకుల కారణంగా వ్యర్థాలు సరఫరా అయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే రంగుమారిన, దుర్వాసనతో కూడిన నీరు వస్తోందని పలు కాలనీల వారు గగ్గోలు పెడుతున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



మందుగుండు తోట దారిలో కాలువలో నుంచి వెళ్తున్న పైపులైన్లు

క్లోరిన్ పరీక్షలేవీ?

ముషిడిపల్లి, నెల్లిమర్ల పథకాల నుంచి నగరానికి తాగునీరు వస్తోంది. ట్యాంకులకు సరఫరా చేసే ముందే క్లోరినేషన్ ప్రక్రియ పూర్తికావాలి. అయితే నిర్దేశిత సమయం, ప్రమాణంలో జరగడం లేదనే ఆరోపణలు న్నాయి. మరోవైపు ట్యాంకుల శుభ్రత సైతం అటకెక్కింది. ఉడాకాలనీలోని ఫేజ్-1, ఫేజ్-2 ట్యాంకుల మెట్లు పదేళ్ల క్రితం మరమ్మతుకు గురయ్యాయి. ఇంతవరకు పునరుద్ధరించకపోవడంతో కిందున్న సంపులోని నీటిని ఎక్కిస్తున్నారు. చాలాచోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది.



కంటోన్మెంట్ చాకలివీధిలో లీకులు

నీరందేది సగం మందికే..

నగరపాలిక పరిధిలో 3 లక్షలకు పైగా జనాబా ఉన్నారు. వీరికి 36 ప్రధాన ట్యాంకుల నుంచి 27,264 కుళాయిల ద్వారా రోజూ 48 ఎంఎల్‌డీల తాగునీరు అందించాలి. అయితే ప్రస్తుతం రోజు విడిచి రోజు 26 ఎంఎల్‌డీలు మాత్రమే ఇస్తున్నారు. సాధారణంగా ఒక్కో ట్యాంకు నిండడానికి 22 గంటలు పడుతోంది. ఈక్రమంలో విద్యుత్తు సరఫరా ఆగిపోతే వేళలు మారిపోతున్నాయి. కాలువల్లో నుంచి వెళ్తున్న పైపులైన్లు గుర్తించి వాటిని పైకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. లీకులు లేకుండా చూస్తున్నామని, ట్యాంకులను ప్రతినెలా శుభ్రం చేయిస్తామని వెల్లడించారు.

ఆకలి తీర్చేందుకు సిద్ధం!!

నాడు



వైకాపా హయాంలో నిరుపయోగంగా భవనం

నేడు



సరికొత్త హంగులతో రూపుదిద్దుకుని ఇలా..

పేదలు, నిరాశ్రయుల ఆకలి తీర్చేందుకు నెల్లిమర్లలోని నగర పంచాయతీ కార్యాలయం సమీపంలో అన్న క్యాంటీన్ సిద్ధమైంది. తెదేపా ప్రభుత్వ హయాంలో ఇక్కడ భవనాన్ని నిర్మించారు. క్యాంటీన్ పెట్టాలని భావించారు. ఈలోపు ఎన్నికలు రావడం, వైకాపా అధికారం చేపట్టడంతో నిరుపయోగంగా వదిలేశారు. దీంతో చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయాయి. పిచ్చిమొక్కలు పెరిగాయి. తాజాగా కూటమి ప్రభుత్వ నిర్ణయంతో క్యాంటీన్‌గా తీర్చిదిద్దారు. రూ.11 లక్షల మేర ఖర్చు చేసి, హంగులద్దారు. రోజుకు 500 మందికి అల్పాహారం, భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరికొన్ని రోజుల్లో ప్రారంభిస్తామని కమిషనరు కె.అప్పలరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లిమర్ల

మహిళా స్నేహపూర్వక పంచాయతీగా గంట్యాడ

గంట్యాడ, న్యూస్‌టుడే: గంట్యాడ పంచాయతీకి అరుదైన గౌరవం దక్కింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా మహిళా స్నేహపూర్వక పంచాయతీగా ఎంపికైనట్లు ఎంపీడీవో ఆర్వీ.రమణమూర్తి తెలిపారు. స్వయం సాధికారత, వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా సాధించిన ప్రగతి, వెలుగు ద్వారా జీవన ప్రమాణాల మెరుగు, అంగన్‌వాడీ వ్యవస్థ వల్ల కలిగే లాభాలు, చైతన్యం కోసం సఖి సంఘాల కృషి, వైద్య సేవలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, హక్కుల పరిరక్షణ తదితర అంశాల ప్రాతిపదికగా ఎంపిక చేశారని చెప్పారు. ఈ మేరకు మన రాష్ట్రం నుంచి గంట్యాడ జాతీయ స్థాయి పోటీలకు వెళ్లనుందన్నారు. అందులో భాగంగా సోమవారం లఘు చిత్రాన్ని తీసి, పంపించామని చెప్పారు. ఉత్తమ పంచాయతీగా నిలిస్తే రూ.కోటి, ద్వితీయ- రూ. 75 లక్షలు, తృతీయ స్థానం దక్కితే రూ.50 లక్షలు అందిస్తారన్నారు. సర్పంచి బి.రామారావు, ఎంపీటీసీ సభ్యురాలు నారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గంట్యాడ మహిళలు

ఏడిపిస్తున్న ఏబీ రోడ్డు

ఆంధ్ర- ఒడిశా సరిహద్దుల్లో ప్రయాణాలు కత్తిమీద సాములా తయారయ్యాయి. రహదారులు దారుణంగా మారడంతో లారీ చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



పెద్దదిమిలి వద్ద ఏర్పడిన భారీ గుంతలో చేరిన నీరు



బగ్గామత్రిపాడు సమీపంలోని వంతెనపై ఏర్పడిన గొయ్యి

భామిని మండలంలో 27 కిలోమీటర్ల పొడవున ఉన్న ఏబీ రహదారి ఎక్కడికక్కడ గుంతలతో దర్శనమిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాటిల్లో నీరు చేరింది. బగ్గామత్రిపాడు కాజ్‌వేపై ఏర్పడిన గోతిలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ ఇసుక లారీ కూరుకుపోయింది. దీంతో ఊక, గ్రానైట్, ఇసుక లారీలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సోమవారం ఉదయం పొక్లెయిన్ సాయంతో వాహనాన్ని బయటకు తీయడంతో ట్రాఫిక్ అంతరాయం తొలగింది. రోజూ ఇదే పరిస్థితి ఉంటోందని చోదకులు వాపోతున్నారు. దీనిపై ర.భ శాఖ ఏఈ జగన్మోహనరాజు వద్ద ప్రస్తావించగా.. త్వరలో మరమ్మతులు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, భామిని

నేడు విజయానంద్ రాక

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గుర్ల ఘటనపై విచారించేందుకు ప్రత్యేకాధికారిగా నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో అధికారులతో సమావేశమవుతారు. అనంతరం గుర్ల పయనమై క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారని జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ తెలిపింది.



ఈదురుగాలుల బీభత్సం

వంగర మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి కొప్పర, కొండచాకరాపల్లి, కొప్పరవలస, మద్దివలస తదితర గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. సుమారు 80 ఎకరాల వరకు దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. పొట్ట దశలో పంట నేలకొరగడంతో పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. – న్యూస్‌టుడే, వంగర



పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం



నివాళులర్పిస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే అదితి, కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ప్రజారక్షణ విధుల్లో ప్రాణాలు సైతం పణంగా పెట్టి శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేసే కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పరేడ్ మైదానంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ సమర్థంగా పనిచేస్తేనే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు ఆయన ఘన నివాళులర్పించారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పోలీసు కుటుంబాలతో మాటామంతీ

పోలీసు అమరవీరుల కుటుంబాలతో ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం పరేడ్ మైదానంలో స్మృతివనం వద్ద మమేకమయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పండ్లు, నగదును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఎప్పుడు.. ఏ అవసరమున్నా తనను సంప్రదించవచ్చునని ఎస్పీ భరోసా ఇచ్చారు. పరేడ్ మైదానం నుంచి మయూరి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కార్పస్ ఫండ్ చెక్కు అందజేత

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆర్పీ వలస పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.నారాయణరావు కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.లక్ష అదనపు కార్పస్ ఫండ్ చెక్కు ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు కార్యాలయంలో అందజేశారు.



అమరవీరుల త్యాగాలను నినదిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎస్పీ జిందాల్ తదితరులు

కాకర సాగు.. లాభాలు బాగు

రైతేరాజు



కాకర పంట

భామిని, రామభద్రపురం, న్యూస్‌టుడే: కూరగాయల పంటల్లో కాకర సాగుతో ఏడాది పొడవునా లాభాలు పొందుతున్నారు భామిని, రామభద్రపురానికి చెందిన రైతులు.. రామభద్రపురంలోని 150 ఎకరాల్లో 300 మంది కాకర వేశారు. ఈ ఏడాది మార్కెట్లో ధర బాగుందని, దిగుబడులు ఎక్కువగా వచ్చాయని చెబుతున్నారు. రామభద్రపురం మార్కెట్లో 16 కిలోల కేటు గతంలో రూ.200 ఉండగా ప్రస్తుతం రూ.350 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నట్లు తెలిపారు.

ఇదీ సాగు విధానం..

పంట సాగుచేసే ముందు 2, 3 దుక్కులు వేయాలి. ఎకరాకు 8 టన్నుల పశువుల వ్యర్థాలు చల్లాలి. 32 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్, నాటిన 30 రోజులకు, పూత పిందె దశలోనూ వేయాలి. నీరు మళ్లేలా కాలువలు తవ్వి, నెలకు 4, 5 సార్లు నీరు పెట్టాలి. మొక్కల మధ్య మీటరు దూరంలో పందిరి వేయాలి.

తెగుళ్ల నివారణ తప్పనిసరి..

కాకరను ఎక్కువగా ఆకుముడత, రసం పీల్చే తెగుళ్లు ఆశిస్తాయి. ఆకుముడత నివారణకు కోల్‌పాస్ 2, శాఫ్ 2 గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగు ఆశిస్తే లీటరు నీటికి థయోమీథాక్సిన్ 0.3 మి.లీ, అంత్రాకాల్ 2 గ్రాములను కలిపి పిచికారీ చేయాలి. పసుపు ఆకు నివారణకు 19-19-19 మందు, ఆగ్రోమిన్‌మాక్స్ 5 గ్రాముల చొప్పున నీటిలో కలిపి చల్లాలని ఉద్యాన అధికారులు పి.జయశ్రీ, మోహన్‌కృష్ణ తెలిపారు.



సాగు ఆదుకుంది..: సోంపురానికి చెందిన రాజాన ఈశ్వరరావు అరెకరం భూమిలో కాకర సాగు చేస్తున్నారు. విత్తనాలు, కంపలు, ఎరువులు, పురుగు మందుకు రూ.15 వేలు మదుపు పెట్టగా రూ.50 వేలు ఆదాయం సంపాదించారు. మార్కెట్లో కేట్ కాయలు రూ.400 పలకడంతో లాభాలు ఆర్జించారు.



రెండు నెలల్లో లాభం.. భామిని మండలం సతివాడకు చెందిన బల్లు జనార్దనరావు. 30 సెంట్లలో పంట వేశారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, కలుపు నివారణకు రూ.15 వేలు ఖర్చు చేశారు. రెండు నెలల్లో 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కిలో రూ.30 చొప్పున రూ.54 వేలకు అమ్మారు. పెట్టుబడి పోనూ రూ.39 వేలు లాభం వచ్చినట్లు జనార్దనరావు తెలిపారు.

వేరుసెనగలో లద్దె పురుగుతో జాగ్రత్త



లద్దె పురుగు సోకిన వేరుసెనగ

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేరుసెనగ విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ పంటకు ఎక్కువగా వ్యాపించే పొగాకు లద్దెపురుగు నివారణకు కురుపాం ఉద్యాన అధికారిణి సి.హెచ్.గిరిజ పలు సూచనలు చేశారు.

★ గుడ్ల సముదాయం, పిల్ల పురుగులను నాశనం చేయాలి.

★ లింగాకర్షక బుట్టలు పెట్టి తల్లి పురుగు వృద్ధిని గమనించాలి. ట్రైకోడెర్మా గుడ్ల పరాన్నజీవిని ఎకరాకు 50 వేల వరకు 7 నుంచి 10 రోజుల వ్యవధిలో నాలుగు సార్లు వదలాలి.

★ గుడ్లు తొలిదశలో పిల్ల పురుగు నివారణకు వేపగింజల కషాయం లేదా నూనె పిచికారీ చేసుకోవాలి.

★ లార్వా కనిపిస్తే నోవాల్యూరాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండిమైడ్ 0.2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

బొప్పాయి సాగులో మెలకువలు..!

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: బొప్పాయి తోటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడులు వస్తాయని కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసరాజు తెలిపారు. ◆ నీరు నిలవని నల్లగరప, ఎర్ర నేలలు అనుకూలం. ◆ నేల ఉదజని సూచిక 6.5 నుంచి 8.5 వరకు ఉండాలి. ◆ కాండం కుళ్లు ఆశిస్తే లీటరు నీటికి 3 గ్రా. బ్లైటాక్స్ లేదా ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని కలిపి మొదళ్లలో వేయాలి ◆ ఆకుమచ్చ తెగులు ఆశిస్తే డైథేన్ ఎం-45 లీటరు నీటికి 2.5 గ్రా. చొప్పున కలిపి ఆకులపై పిచికారీ చేయాలి.

ఎరువుల యాజమాన్యంతో పంటలకు మేలు



గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులు సరైన ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని, మోతాదుకు మించితే అనర్థమని విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త **తేజేశ్వరరావు** సూచించారు. రైతుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

? మిరపలో ఎరువుల యాజమాన్యం గురించి చెప్పండి? **- జి.తిరుమలరావు, రావివలస, గరుగుబిల్లి మండలం**

☛ ఎకరాకు 120 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 48 కిలోల పొటాష్ వేయాలి. ఆఖరి దుక్కిలో లేదా నాటు వేసే సమయంలో భాస్వరం మొత్తం ఒకేసారి వేయాలి. నత్రజని, పొటాష్‌ను తక్కువ మోతాదులో నాటిన లేదా విత్తిన 30, 60, 90, 120 రోజులకు నాలుగు సార్లు వేయాలి.

? వరిలో దోమ నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి? **- ఎ.రాంబాబు, బుడతనాపల్లె, గంట్యాడ మండలం**

☛ దోమ ఆశించిన వెంటనే లీటరు నీటిలో పైమెట్రోజైమ్ 0.6గ్రా. లేదా డైనోటెఫ్యూరాన్ 0.4గ్రా. లేదా ట్రైఫ్లూమెజోపైరం 0.48 మి.లీ. చొప్పున కలిపి మందులు మారుస్తూ పిచికారీ చేయాలి. చేనును అడపా దడపా ఆరబెడితే దోమ ఉద్ధృతి తగ్గుతుంది. పురుగు మందు మొక్కల మొదళ్లకు బాగా తగిలేలా పిచికారీ చేస్తే దోమను సులభంగా నివారించవచ్చు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

ఖరీఫ్ పంటల్లో కోత, నూర్పిడిలో పాటించాల్సిన పద్ధతులు, రబీ సీజన్‌లో ఆరుతడి పంటల్లో విత్తన ఎంపిక, విత్తనశుద్ధిలో సలహాలకు 94410 13693 నంబరుకు సంప్రదించాలని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు.

‘రైతు నేస్తం’ పురస్కారం



వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న గౌరీశ్వరరావు

రాజాం, న్యూస్‌టుడే: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రకృతి సేద్యం రైతు పెంకి గౌరీశ్వరరావు సోమవారం ‘రైతు నేస్తం’ పురస్కారం అందుకున్నారు. ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివారం ఈ పురస్కారం అందుకున్నట్లు ఆయన ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. గౌరీశ్వరరావు పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ.. తోటి రైతులకు శిక్షణ ఇస్తున్నారు. స్వీయ సాగులో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. జీడి, మామిడితోపాటు వరి, అపరాలను ఈ పద్ధతిలోనే సాగు చేస్తూ వస్తున్నారు.

24న మెగా ఉద్యోగ మేళా

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జి సెంటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి పీజీ పూర్తి చేసిన 35ఏళ్లలోపు నిరుద్యోగులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ వివరాలు skilluniverese.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 79956 91295 నంబరును సంప్రదించాలన్నారు.

10 రోజులు.. ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

గుర్ల ఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: గుర్ల ఘటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవోలతో సోమవారం సాయంత్రం దూరదృశ్య సమావేశం నిర్వహించారు. రోజూ తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలని, దీన్ని అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు త్వరలో ప్రత్యేక ప్రణాళిక రూపొందిచనున్నట్లు తెలిపారు. తుపాను ప్రభావంతో బుధ, గురువారాల్లో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశమున్నందున అధికారులంతా 22 నుంచి 26 వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా, డివిజన్, మండలస్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముందస్తు చర్యలపై మంగళవారం సాయంత్రానికి ప్రణాళిక అందజేయాలన్నారు. డీఆర్వో ఎస్.డి.అనిత పాల్గొన్నారు.

కబడ్డీలో ప్రథమంగా నిలపడమే ధ్యేయం

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని కబడ్డీలో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సంఘం కార్యదర్శి వై.శ్రీకాంత్ అన్నారు. జిల్లా కబడ్డీ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అసోసియేషన్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను దేశానికి అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లా నూతన కమిటీ ఛైర్మన్ ఐవీపీ రాజు, అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావు దొర, కేవీ ప్రభావతితో పాటు 16 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు విశ్రాంత న్యాయమూర్తి సుబ్బరాజు ప్రకటించారు. పరిశీలకులుగా వర్కింగ్ అధ్యక్షుడు అర్జునరావు, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

నేడు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

పార్వతీపురం పట్టణం: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం వెంకంపేట సమీపంలో నిర్వహిస్తామని సంఘ జిల్లా కార్యదర్శి ఎం.మురళీకృష్ణ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, డీటీ గాంధీ, వైకుంఠరావు పాల్గొన్నారు.

నగరంలో చీకటి రహదారులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే

విజయనగరంలో చీకటి పడితే పలు దారుల్లో అంధకారం అలుముకుంటోంది. తెదేపా హయాంలో పురపాలక సంఘంగా ఉన్నప్పుడు ఈఈఎస్ఎల్ కంపెనీ ద్వారా ఎల్ఈడీ దీపాల నిర్వహణ జరిగేది. అప్పట్లో వీధిదీపాల సమస్య లేకుండా ఉండేది. గతేడాది మార్చి నుంచి ఈ సంస్థతో ఒప్పంద గడువు పూర్తయింది. మూడు నెలలు పొడిగించినా మధ్యలోనే వైదొలగింది. వైకాపా ప్రభుత్వ హయాంలో దీన్ని పొడిగించకపోవడంతో వీధి దీపాల సమస్య మొదటికి వచ్చింది.

నెలాఖరుతో గడువు పూర్తి..

ఈఈఎస్ఎల్ కంపెనీ వైదొలగిన తర్వాత కొన్ని నెలలు నగర పాలక సంస్థ నిర్వహించింది. గతేడాది నవంబరులో శ్రీసిరి కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు బాధ్యత అప్పగించింది. ఏడాది కాలానికి రూ.1.59 కోట్లతో టెండరు దక్కించుకుంది. ఈఈఎస్ఎల్ ఉన్నప్పుడు మాదిరిగా వీధి దీపాల నిర్వహణ లేదనే విమర్శలున్నాయి. ఈఈఎస్ఎల్ ఉన్నప్పుడు బల్బు పోతే కొత్తది వేసేవారు. కొత్త ఏజెన్సీ ఏ భాగం పోతే దాన్ని మారుస్తుండటం వల్ల వెలుతురు తగ్గుతోందనే విమర్శలున్నాయి. ఉదాహరణకు దీపానికి బోర్డు, డ్రైవర్ ఉంటాయి. వీటిలో ఏది పోతే దాన్ని మార్చి దీపం వెలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఒక బల్బు వెలిగించినందుకు రూ.53 నగర పాలక సంస్థ చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు.



ఒరుగంటివారి తోట దారిలో కారు చీకట్లు

మొత్తం దీపాలు 20,050

ఇక్కడ అన్ని రకాల దీపాలు 20,050 ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వాటిలో ఈఈఎస్ఎల్ ద్వారా వేసినవి 18,474 ఉన్నాయి. తదుపరి నగర పాలక సంస్థ మరికొన్నింటిని కొనుగోలు చేసి వేసినట్లు చెబుతున్నారు. ఇక్కడ డివిజన్‌కు 10 చొప్పున 50 డివిజన్లలో 500 వరకు వీధి దీపాలు వేయాలని గుర్తించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ★ ప్రస్తుతం నగరంలో సుమారు 1500 వరకు వివిధ కారణాలతో వెలగని దీపాలు ఉన్నట్లు చెబుతున్నారు. లక్ష్మీగణపతి కాలనీ, పూల్‌బాగ్ ప్రాంతం, అయ్యన్నపేట, కోర్టు దారి నుంచి ప్రదీప్‌నగర్ మీదుగా ధర్మపురి వరకు, పద్మావతినగర్ నుంచి ధర్మపురి దారిలో, కేఎల్‌పురం రెవెన్యూ కాలనీ, కలెక్టరేట్ దారిలోని ఏసీబీ కార్యాలయ రోడ్డు తదితర చోట్ల కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. చీకటి పడితే ఎల్‌బీ కాలనీ దారిలో పలు చోట్ల మసకగా రహదారులు ఉన్నాయి. కంటోన్మెంట్ ఉడా కాలనీ దారిలో దీపాలు వెలగడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. కుక్కల సంచారం పెరగడంతో రాత్రులు వీధి దీపాలు వెలగని చోట్ల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మళ్లీ ఈఈఎస్ఎల్ నిర్వహణలోనికి తీసుకురావాలని కోరుతున్నారు. దీపాలు సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య ‘న్యూస్‌టుడే’కు తెలిపారు.

వీధి దీపాల నిర్వహణపై విమర్శలు

కేజీబీవీలో కలకలం

గోడ దూకి ఇద్దరు విద్యార్థినుల పరారీ

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం కస్తూర్బా విద్యాలయంలో ఇంటరు ప్రథమ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఆదివారం గోడ దూకి పారిపోవడం సంచలనం సృష్టించింది. అర్ధరాత్రి 2.45 గంటలకు స్నానం చేసే బకెట్ల పైనుంచి గోడ అవతలకు దిగి పరారైనట్లు సీసీ ఫుటేజీలో కనిపించింది. సోమవారం ఉదయం స్టడీ అవర్‌కు పిలిచే సమయంలో ఇద్దరూ కనిపించలేదు. ప్రత్యేకాధికారిణి ప్రమీల జిల్లా అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా బాలికల సంరక్షణ అధికారిణి నీరజ, పోలీసులు తోటి విద్యార్థినులు, ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. ఒక విద్యార్థిని తల్లి దండ్రులు, అన్నయ్యను విడిచిపెట్టి ఉండటం ఇష్టం లేదని నోటు పుస్తకంలో రాసిన లేఖను అధికారులు గుర్తించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదనరావు తెలిపారు.



ప్రత్యేకాధికారిణితో మాట్లాడుతున్న బాలికల సంరక్షణ అధికారిణి నీరజ

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సీతారాం

మెంటాడ, న్యూస్‌టుడే: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మెంటాడ మండలంలో చోటుచేసుకుంది. ఆండ్ర ఎస్ఐ సీతారాం వివరాల ప్రకారం.. గజపతినగరం మండలం కొనిశకు చెందిన పి.అప్పలనర్సింహరాజు(57) ద్విచక్ర వాహనంపై మెంటాడ మీదుగా వెళ్తున్నారు. హరిత రహదారి పనులకు ముగ్గురు వ్యక్తులతో వస్తున్న మరో ద్విచక్ర వాహనం గద్దె చిన్నచెట్టుకు సమీపంలో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు క్షతగాత్రుడిని మెంటాడ పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అప్పలనర్సింహరాజుకు వృద్ధురాలైన తల్లి ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని రాణిమల్లమ్మదేవి చెరువు గట్టుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సీఐ సతీష్‌కుమార్ వివరాల మేరకు.. సోమవారం ఉదయం గట్టుపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆయన వద్ద మందులు, చీటీలు ఉన్నాయి. అందులో కె.గౌరీశంకర్‌గా రాసి ఉంది. స్థానిక ఆసుపత్రిలోని ఓపీ రిజిస్టర్‌లోనూ ఆ పేరు నమోదై ఉంది. ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాక ఇక్కడ సొమ్మసిల్లి పడిపోయారా? గుండెపోటుతో చనిపోయారా? అన్నది తెలియాల్సి ఉందని సీఐ అన్నారు. సుమారు 45 ఏళ్ల వయసు ఉంటుందని చెప్పారు. వివరాలు తెలిస్తే 9121109422కు ఫోన్ చేయాలని కోరారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం కోట, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో మెషినిస్ట్ అప్రెంటీస్ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులు 31లోగా www.apprentieship.gov.inలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం నవంబరు 7న ఉదయం 10 గంటలకు వి.టి.అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ కళాశాలకు హాజరుకావాలని కోరారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు మరో కౌన్సెలింగ్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి అయిదో విడత కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా కన్వీనర్ టి.వి.గిరి ఓ ప్రకటనలో తెలిపారు. 28న ప్రభుత్వ ఐటీఐ, 30న ప్రైవేటు ఐటీఐల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్, 26న యూనిక్ నంబరుతో ఐటీఐలో ధ్రువపత్రాలు పరిశీలన చేసుకోవాలని కోరారు.

గడువు పెంపు

పార్వతీపురం పట్టణం: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణకు సంబంధించిన దరఖాస్తుల గడువు ఈ నెల 25 వరకు పెంచినట్లు డీడీ గయాజుద్దీన్ తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో అభ్యర్థులు, శిక్షణ ఇచ్చే సంస్థలు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.




ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాకతో గుర్లలో పరిశుభ్రత పనులు జోరుగా చేపట్టారు. సోమవారం నీటి పథకం పరిశీలనకు ఆయన వస్తున్న నేపథ్యంలో తగు ఏర్పాట్లు చేశారు. విజయనగరం- పాలకొండ రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. పవన్ రాక కోసం పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు చంపావతి నీటి పథకం వద్ద ఎదురుచూశారు. పవన్‌ను చూసేందుకు మహిళలు, యువత అధిక సంఖ్యలో చేరుకున్నారు. - న్యూస్‌టుడే, గుర్ల, గరివిడి, చీపురుపల్లి

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

కల్వర్టు లేక అవస్థలు



చీపురుపల్లి పట్టణంలోని జి.అగ్రహారంలో బ్రాహ్మణవీధి కూడలిలో కల్వర్టు లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. గతంలో కూడలి నుంచి గ్రామ సచివాలయానికి సిమెంటు రహదారి నిర్మించారు. కానీ కల్వర్టు పనులు చేయకుండా వదిలేశారు. దీంతో రహదారి ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. సమస్య పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాలరావు దృష్టికి తీసుకెళ్లగా.. కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు - న్యూస్‌టుడే, చీపురుపల్లి



సృజన.. విజ్ఞాన శోధన



రాజాం పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం 'ప్రతిభా పోటీలు' ఉత్సాహంగా జరిగాయి. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు', 'విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఎం.కరిష్మా(9వ తరగతి), సీహెచ్ అమృత(10వ తరగతి), యు.పునీత్(9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి జి.సురేంద్ర, డీన్ బి.హరిశ్రీనివాస్ విద్యార్థులను అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, రాజాం

డోలపేట.. సమస్యల మేట

మౌలిక వసతులు కరవు



తనిఖీ కేంద్రం సమీపంలో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు


న్యూస్‌టుడే- రాజాం

రాజాం పురపాలిక పరిధిలోని డోలపేటలో మౌలిక సమస్యలు వెంటాడుతున్నాయి. పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతంలోని పలు వీధులు ఇప్పటికీ సీసీ రహదారులు, కాలువలకు నోచుకోలేదు. డోలపేట ప్రధాన వీధి గోతులమయంగా మారింది. తనిఖీ కేంద్రం నుంచి శ్మశానవాటిక వరకూ రహదారి నిర్మించాలని గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేశారు. అప్పట్లో కొంత భాగం నిర్మాణం జరిగినా.. పిండిమిల్లు నుంచి శ్మశానవాటిక వరకూ రోడ్డు నిర్మాణాన్ని వదిలేశారు. నిత్యం వందలాది వాహనాలు, జనం ప్రయాణించే మార్గం కావడం, పలు విద్యా సంస్థలు, ఆసుపత్రికి ఇదే ప్రధాన మార్గంగా మారడంతో జనం అవస్థలు పడుతున్నారు.

రాజాం-పాలకొండ రహదారి గోతులమయంగా మారడంతో డోలపేట ప్రధాన మార్గం గుండా రద్దీ పెరిగిపోయింది. దీన్ని తక్షణమే నవీకరించేందుకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో నిర్మించిన రహదారి భాగం సైతం గోతులమయంగా మారడంతో మరమ్మతులు చేయించాలని డిమాండు చేస్తున్నారు. పెట్రోలు బంకు ప్రాంతంలోని వీధులకు మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంది. తనిఖీ కేంద్రం సమీపంలోని వరద కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. పీఎన్ కాలనీ రెండో వీధిలో సీసీ రహదారి నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు చెప్పినా.. ఇప్పటికీ అతీగతీ లేదు. గొడితోట ప్రాంతంలోని వీధులు మౌలిక వసతులకు ఎదురుచూస్తున్నాయి.

ప్రాధాన్యత క్రమంలో..

డోలపేట ప్రాంతంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయిస్తున్నాం. ప్రజలకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం.
- జి.రామ అప్పలనాయుడు, పురపాలక కమిషనర్



గోతులమయంగా డోలపేట ప్రధాన రహదారి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? గజరాయునివలస గ్రామంలో ప్రధాన రహదారి నిర్మాణం సగంలో నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు
● పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. - నాయుడు, ఏఈ
- న్యూస్‌టుడే, రామభద్రపురం

? గింజేరు- పెదమకిపాలెం రహదారిలో చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది.
● పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి, చెత్త వేయకుండా చర్యలు చేపడతాం. - భానోజీరావు, ఈవోపీఆర్డీ - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? చిన్నమ్మతల్లి గుడి మీదుగా వంగపండువలసకు వెళ్లే రహదారి, కాలువలు పాడైపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు
● రహదారి, కాలువలు బాగు చేయడానికి ప్రతిపాదనలు పంపించాం. - రమేష్, ఏఈ
- న్యూస్‌టుడే, రామభద్రపురం

ఉత్తరాంధ్ర ఆచార్యులనే నియమించాలి



మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే కళాకు వినతిపత్రం అందిస్తున్న రమణమూర్తి

గుర్ల, గరివిడి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశ్వవిద్యాలయాలకు ఉత్తరాంధ్రకు చెందిన వారినే ఆచార్యులుగా నియమించాలని విద్యార్థి సేన అధ్యక్షుడు సుంకరి రమణమూర్తి డిమాండు చేశారు. సోమవారం గుర్ల పర్యటనకు వచ్చిన మంత్రి కె.శ్రీనివాస్, ఎమ్మెల్యే కళావెంకటరావుకు వినతిపత్రాలు అందజేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నందున ఇతరులకు ప్రాధాన్యం ఇవ్వడం తగదన్నారు. ఈ సమస్యను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళతామని నేతలు హామీ ఇచ్చారని రమణమూర్తి తెలిపారు. విద్యార్థి సేన నేతలు ఆర్.సీతారాం, కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

'కాలుష్యంతో కంటి సమస్యలు'

రేగిడి, న్యూస్‌టుడే: సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర పరిశ్రమ వల్ల కాలుష్యం వ్యాప్తి చెందుతోందని చిన్నయ్యపేట గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వీరంతా సోమవారం పరిశ్రమ వద్ద నిరసన తెలిపారు. తాగునీరు కలుషితం అవుతోందని, దుమ్ము, ధూళి, మసితో కంటి సమస్యలు వస్తున్నాయని చెప్పారు. వ్యర్థాలు నేరుగా చెరువుల్లో కలుస్తున్నాయని, నీరు కలుషితమవుతోందని ఆక్రోశించారు. జనం ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నట్లు చెప్పారు. యాజమాన్యం తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.



పరిశ్రమ ఎదుట చిన్నయ్యపేట గ్రామస్థుల నిరసన

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు షికారుగంజి ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ దేవికీ నందన తెలిపారు. ఈనెల 19న జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో బి.విమల, ఎస్.వినీత, వి.రాజ్యలక్ష్మి, అభిరాం హర్డిల్స్ క్రీడల్లో, డి.జాహ్నవి డిస్కస్‌త్రో, కె.రూప్ ట్రిపుల్ జంప్, పి.అనూష, డి.సింధు పద్మజ, సాయిపవన్ జావెలిన్‌త్రోలో, పి.శ్రావణి 800 మీటర్ల పరుగు పందెంలో, బి.రోహన్ అయిదు కిలో మీటర్ల రేస్‌వాక్‌లో ప్రతిభ చూపినట్లు తెలిపారు. వీరు ఈనెల 25 నుంచి రెండు రోజులపాటు కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు.

అయిదుగురు అగ్నివీర్‌లకు సత్కారం

గజపతినగరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ మొదటి ఏడాది నుంచి డిగ్రీ చివరి వరకు ఒకే కళాశాలలో, ఒకే తరగతిలో చదివిన అయిదుగురు యువకులు ఒకేసారి ఉద్యోగాలు సాధించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అగ్నివీర్ ఉద్యోగాలకు స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు ఎంపిక కావడంతో వారిని యాజమాన్యం సోమవారం సత్కరించింది. పాతబగ్గాం గ్రామానికి చెందిన పప్పల రామునాయుడు, ప్రసాద్ అన్నదమ్ములు కాగా, అబ్బులు, కె.సత్యనారాయణ, కె.కిరణ్‌కుమార్ స్నేహితులు. ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని, బాధ్యతగా పనిచేయాలని అధ్యాపకులు పేర్కొన్నారు.



యువకులను సన్మానించిన కళాశాల యాజమాన్యం

అభివృద్ధి పనులకు పెద్దపీట



మేదరవీధిలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పురపాలక పరిధిలోని అన్ని ప్రాంతాలకు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కమిషనర్ జి.రామ అప్పలనాయుడు తెలిపారు. మేదరవీధిలో రూ.11.20 లక్షలతో చేపడుతున్న సీసీ రహదారి పనులను సోమవారం పరిశీలించారు. పట్టణంలో 302 వీధి శునకాలను గుర్తించామని, ఇప్పటివరకు 105 కుక్కలను పట్టి సంతాన నిరోధక శస్త్రచికిత్సలకు పంపినట్లు వెల్లడించారు. సోమవారం ఒక్క రోజే 20 శునకాలను పట్టుకుని తరలించినట్లు ఆయన చెప్పారు.

కెంగువలో అతిసారం లక్షణాలు

గజపతినగరం, న్యూస్‌టుడే: అతిసారం వ్యాధి లక్షణాలతో కెంగువ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు సోమవారం గజపతినగరం సామాజిక ఆసుపత్రిలో చేరారు. ఎస్.సింహాచలం, ఎం.సూరమ్మ, పి.సత్యం పరిస్థితి అదుపులో ఉందని వైద్యులు తెలిపారు. ఎస్.బంగారునాయుడుని మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎంఎస్‌కే రెడ్డి, సుష్మా కెంగువ గ్రామంలో ఇంటింటి సర్వే చేయించి, వ్యాధి లక్షణాలపై ఆరా తీశారు. డీఈ తిరుపతినాయుడు, ఏఈ శ్రీనివాస్ నీటి వనరులను పరిశీలించారు. పథకం నుంచి తాగునీటి సరఫరాను నిలుపుదల చేశారు. బోరు బావుల్లో క్లోరినేషన్ చేయించారు.

వ్యాధి ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

గుర్ల, న్యూస్‌టుడే: నాగళ్లవలసలో డయేరియా బాధితులను సోమవారం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. వ్యాధి ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. వైకాపా నేతలు శీర అప్పలనాయుడు, పి.సన్యాసినాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాట్లు, వైద్య సేవల తీరును డీఎంహెచ్‌వో భాస్కరరావు పరిశీలించారు.

అనారోగ్యంతో చిన్నారి మృతి

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దిగువకొండపర్తి పంచాయతీలో పెదపాడు గిరిజన గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి అనారోగ్యంతో మృతిచెందింది. స్థానికులు, ఐసీడీఎస్ సిబ్బంది వివరాల మేరకు.. ఎగువకొండపర్తి గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపాడు గ్రామానికి చెందిన ఎర్రబోయిన దీనా(4)కు కొద్ది రోజుల క్రితం జ్వరం వచ్చింది. కుటుంబీకులు పసర మందు వేసిన తర్వాత పరిస్థితి విషమించింది. ఆదివారం సాయంత్రం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా చిన్నారి మృతిచెందింది.

అమ్మడమ్మకు పలువురి సంతాపం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ సీనియర్ డైరెక్టరు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు వదిన అమ్మడమ్మ(87) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. పక్కి నివాసంలో ఉన్న ఆమె మృతదేహానికి జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాసు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మృతదేహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

అపారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం



చెత్తతో నిండిన గొల్లవీధి కూడలిలోని కాలువ

బొబ్బిలి పట్టణంలోని కాలువలు అధ్వానంగా మారాయి. ఏ వీధిలో చూసినా వ్యర్థాలతో నిండి ఉన్నాయి. గొల్లవీధి, మేదరబంద కూడళ్లు, ఎరుకుల వీధి, పాత బొబ్బిలి ప్రధాన వీధి, వెలమవారి వీధుల్లోని పురాతన కాలువలు శిథిలావస్థకు చేరాయి. మురుగు పారక దుర్గంధం వెదజల్లుతోంది. కొత్తవి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఐటీఐ సమీప జగనన్న కాలనీల్లో తాగునీటి కోసం కుండీలు నిర్మించారు. వాటిలోనే వర్షపు నీరు చేరి, చెత్తపడి మురుగుగా మారాయి. ఇటీవల మల్లంపేటలో డెంగీ కేసు నమోదైంది. పరిస్థితులు ఇలానే ఉంటే మరిన్ని కేసులు పెరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి తెలిపారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి



పాతచింతపిక్కల మిల్లు వద్ద రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

సంక్షిప్త సమాచారం

నేడు పాగిరిలో ఆధార్ సేవలు

రాజాం: పాగిరిలో మంగళవారం ఆధార్ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు, నవీకరణ సేవలను సద్వినియోగించుకోవాలన్నారు.

వెంటనే జీతాలు చెల్లించండి

సంతకవిటి: పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఆయాలకు, పంచాయతీల హరిత రాయబారులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ నాయకుడు కె.అసిరప్పడు, కార్యవర్గ సభ్యులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

పోరాంలో అథ్లెటిక్స్ పోటీలు

మెంటాడ: ఉమ్మడి విజయనగరం జిల్లా అండర్-17 పోటీలు మంగళవారం మెంటాడ మండలం పోరాంలో జరిగాయి. పరుగు పందెం, జంపింగ్, త్రోస్ విభాగాల్లో క్రీడలు నిర్వహించినట్లు పాఠశాల పీడీ తవిటినాయుడు తెలిపారు.

కొండ చిలువతో భయాందోళన

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీకాకుళం ప్రధాన రహదారిపైకి మంగళవారం తెల్లవారుజామున కొండ చిలువ రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. టీ దుకాణాల వారు, నడకకు వచ్చిన వారు దాన్ని హతమార్చారు.

యంత్రం వితరణ

మెరకముడిదాం: కస్తూర్బా గాంధీ విద్యాలయానికి బాలమిత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామరాజు రూ.9,500 విలువచేసే వెయింగు మిషన్‌ను వితరణగా అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

బొబ్బిలి: పురపాలక ఏఈలుగా ఈశ్వర గుప్త, కోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది వీరిని అభినందించారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి



మెంటాడ: సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ అన్నారు. పార్టీ మహాసభ మెంటాడలో జరిగింది. గుర్లగెడ్డ పూర్తికి, పోడు భూములు సాగుచేస్తున్న గిరిజనులకు పట్టాలు, ఇతర సమస్యల పరిష్కారానికి అంతా కలిసి రావాలని ర్యాలీ నిర్వహించారు.

శివలింగాన్ని తాకిన భానుడు

రాజాం, గ్రామీణం: పట్టణంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో శివలింగాన్ని సోమవారం సూర్యకిరణాలు తాకాయి. ఆలయ పూజారి యశ్వంత్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు.



సిరిపురం కొండకామేశ్వర ఆలయంలో 90 మంది భక్తులు సామూహిక శివదీక్ష మాలను స్వీకరించారు. ప్రధాన పూజారి ప్రకాష్ ఆనందస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు.
- న్యూస్‌టుడే, సంతకవిటి



పారిశుద్ధ్య పనులు

తెర్లాం, న్యూస్‌టుడే: తెర్లాం మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. రంగప్పవలస, చుక్కవలస, వి.చిన్నయ్యపేట గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యపై గత నెలలో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో రేగి రాంబాబు పనులు చేయించాలని కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం రంగప్పవలస, చుక్కవలస తదితర గ్రామాల్లోని కాలువల్లో పూడిక తొలగించారు.

ఈనాడు కథనానికి స్పందన

మురుగు పారింది

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరం, పురిటిపెంట పంచాయతీల్లో మురుగు సమస్య పరిష్కారానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ దుర్గంధంతో ఇబ్బందులపై శనివారం 'ఈనాడు'లో 'మురుగు పారదు.. దుర్గంధం ఆగదు' శీర్షికన ప్రచురించిన కథనానికి ఎంపీడీవో బి.కల్యాణి, ఈవోపీఆర్డీ సుగుణాకరరావు, కార్యదర్శి జనార్దనరావు స్పందించారు.

తాగునీటి ట్యాంకు శుభ్రం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: సుజలధార నీటి పథకం ద్వారా చీపురుపల్లి, గరివిడి మండలాల్లోని గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వెనుక ఉన్న ఓహెచ్‌బీఆర్‌ను సిబ్బంది శుభ్రం చేశారు. ఎప్పటికప్పుడు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం లేదంటూ ఈనెల 20న 'ట్యాంకులు అధ్వానం.. జలాలు కలుషితం' అనే శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి, సోమవారం ట్యాంకును శుభ్రం చేయించారు.



విరిగిన షట్టర్లు పాడైన చెక్‌డ్యామ్‌లు

అయిదేళ్లుగా ఏడొంపుల గెడ్డకు గ్రహణం

న్యూస్‌టుడే, రామభద్రపురం

గత ప్రభుత్వ హయాంలో సాగునీటి పథకాల బాగుకు నిధులు కేటాయించక పోవడంతో మూలకు చేరాయి. దీంతో రైతులు అయిదేళ్లుగా సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. రామభద్రపురం మండలం కొండకెంగువ గ్రామంలోని ఏడొంపులగెడ్డ ఆనకట్ట పాడైపోయింది. షట్టర్లు తుప్పుపట్టిపోయాయి. ఈ సమస్యపై ఎన్నిసార్లు గత పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కొండకెంగువ సమీప కాలువలో తుప్పలు



ముచ్చర్లవలస సమీపంలో కూలిపోయిన చెక్‌డ్యామ్

ఏడొంపుల గెడ్డ ఆనకట్ట పైభాగం ఇసుకతో నిండిపోవడంతో సాగునీరు వృథాగా పోతోంది. అదే విధంగా రెండువైపులా ఉన్న కుడి, ఎడమ కాలువలు తుప్పలతో నిండిపోయి నీరు పారడం లేదు. కోటశిర్లాం గ్రామంలో కాలువలు పూర్తిగా రూపుకోల్పోయాయి. చెక్‌డ్యామ్‌లు కూలిపోయాయి. ఇటీవల పడిన భారీ వర్షాలకు ఎక్కడికక్కడ గండ్లు పడ్డాయి. దీంతో పంట పొలాలకు సాగునీరు అందడం లేదని పరిధిలోని రైతులు తెలిపారు.

రూ.2.5 కోట్లతో ప్రతిపాదనలు

కొండకెంగువలో ఏడొంపులగెడ్డ కాలువలు, షట్టర్లు, కోటశిర్లాంలో చెక్‌డ్యామ్‌లు, కాలువలు, గట్లు బాగు చేయడానికి రూ.2.5 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నత అధికారులకు పంపించాం. త్వరలో నిధులు మంజూరు అవుతాయి. ఆపై పనులు ప్రారంభిస్తాం.
- హరి, నీటిపారుదల శాఖ ఏఈ, రామభద్రపురం

అమర వీరులకు వందనం

బొబ్బిలి, రామభద్రపురం, న్యూస్‌టుడే: అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు, కోట కూడలి, గాంధీ బొమ్మ, పోలీస్ స్టేషన్ మీదుగా ర్యాలీ సాగింది. సీఐ సతీష్‌కుమార్‌తోపాటు విద్యార్థులు విధి నిర్వహణలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్సు కూడలిలో మానవహారం చేపట్టారు. బాడంగి మండల కేంద్రంలో ఎస్ఐ తారకేశ్వరరావు, రామభద్రపురంలో ఎస్ఐ వై.ప్రసాదరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ

పని భారం తగ్గించాలని డిమాండు

వంగర, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలపై పనిభారం తగ్గించి, రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చూడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు అన్నారు. వంగర తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారుకు అందించారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద నినాదాలు

వినతిపత్రం అందజేత

గజపతినగరం: రామన్నపేట అంగన్‌వాడీ సహాయకురాలు ఎం.సౌజన్యపై రాజకీయ వేధింపులు నిలపాలని, ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు ఆమెను విధుల్లో కొనసాగించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘ నేతలు సీడీపీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. జిల్లా అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షురాలు వి.లక్ష్మి, గజపతినగరం ప్రాజెక్టు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, సుభాషిణి, పద్మావతి, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం

● విజయనగరం ● నెల్లిమర్ల ● ఎస్.కోట



విరిసిన ప్రతిభ

విజయనగరంలోని రింగురోడ్డు పీఎస్ఆర్ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. 'అంతర్జాల వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో టి.ఓజస్విని(పదో తరగతి), ఎం.పర్ణిక (తొమ్మిదో తరగతి), పి.గీతామాధురి(పదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.



ఉపాధ్యాయులు వి.ఎస్.రామకృష్ణ, సీహెచ్.భాస్కర్, కె.దామోదరరావు, ఎస్.నూకరాజు, వై.అపర్ణ, కె.స్వాతి, ఎం.సుధ విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

పరిష్కార వేదికకు ఫిర్యాదులు



సమస్య వింటున్న అదనపు ఎస్పీ సౌమ్యలత

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: పోలీసు కార్యాలయంలో సోమవారం అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. 42 మంది నుంచి ఆమె వినతులు స్వీకరించారు. భూ తగాదాలపై 15, కుటుంబ కలహాలపై 4, మోసాలపై 6, ఇతర సమస్యలపై 17 అర్జీలు వచ్చాయి. వాటిని పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ల అధికారులను ఆమె ఆదేశించారు. డీసీఆర్‌బీ ఎస్ఐ రాజేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరవాసుల కష్టాలు తీరేదెన్నడు.!

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో కనీస మౌలిక సౌకర్యాలు కరవవడంతో వీధులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పన్నులు కడుతున్నా సరైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్లు వ్యయం చేసి సమస్యలు లేకుండా పరిష్కరించామని ప్రకటనలు గుప్పించినా వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని ఆరోపిస్తున్నారు.

బాబోయ్ బ్యాంకు కాలనీ..

34వ డివిజన్ పరిధిలోని బ్యాంకు కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు జరగడం లేదని మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇక్కడ కొన్ని నెలలుగా కాలువల్లో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఇళ్ల ముందే చెత్త గుట్టలు వేసి వదిలేశారని, సొంత ఖర్చుతో తొలగించుకుంటున్నామని స్థానికులు చెబుతున్నారు. బ్యాంకు కాలనీ, బాలాజీనగర్, ఇందిరానగర్‌లో రహదారులు గుంతలమయంగా మారాయి. కనీసం చిన్నపాటి మరమ్మతులకు కూడా నోచుకోలేదని చెబుతున్నారు.



బ్యాంకు కాలనీలో రహదారి దుస్థితి

అధికారులు మాట..

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తామని కమిషనరు పి.నల్లనయ్య, ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాథరావు తెలిపారు.

ప్రమాదకరంగా దారులు

కేఎల్‌పురం నుంచి కాలనీల్లోకి వెళ్లే అప్రోచ్ దారులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడి వినాయక నగర్‌లో వీధి దీపాల సమస్య వెంటాడుతోంది. సాయికీర్తన నగర్ దారిలో రహదారి నిర్మించాలని కోరుతున్నారు. కణపాక యూత్ వసతిగృహానికి వెళ్లే రహదారి పనులు మధ్యలో ఆగిపోవడంతో పిక్క తేలి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ❖ కంటోన్మెంట్‌లోని పావనీ నగర్, సిక్కుల కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ❖ మహారాణిపేటలోని పాత కమిషనరు బంగ్లా శిథిలావస్థకు చేరి పిచ్చి మొక్కలు, చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ❖ గెడ్డవీధిలో బోర్లు పనిచేయడం లేదు. ఇక్కడ కాలువలపై పలకలు వేయకపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామన్నారు. ❖ గుమ్చీ దారిలో కాలువలను కప్పేయడం వల్ల వర్షం పడితే నీరు నిలుస్తోంది.



కేఎల్‌పురంలో అధ్వానంగా అప్రోచ్ రహదారి

అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నేరవార్తా విభాగం: విధి నిర్వహణలో ఎంత పని చేశామన్నది కాదని.. ఎలా చేశామన్నదే ముఖ్యమని పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ) ప్రధానాచార్యుడు డి.రామచంద్రరాజు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పీటీసీలోని స్థూపం వద్ద నివాళులర్పించారు. ప్రజలు పోలీసుల నుంచి మెరుగైన సేవలు కోరుకుంటున్నారన్నారు. ఉప ప్రధానాచార్యుడు అప్పారావు, డీఎస్పీలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పీటీసీ ప్రధానాచార్యుడు తదితరులు

పైడితల్లి వనంగుడికి బెంచీల వితరణ

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరం రైల్వేస్టేషన్ వనంగుడి అమ్మవారిపై భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు విశ్రాంతి తీసుకునే నిమిత్తం సుమారు రూ.40 వేల విలువ చేసే ఎనిమిది బెంచీలను వితరణ చేశారు. భక్తురాలు యశోద జ్ఞాపకార్థం తులసీదాస్, దుర్గాలోకేశ్ 4, రోటరీ క్లబ్ సభ్యులు 4 బెంచీలు అందజేశారు.

తెదేపాలోకి 50 కుటుంబాలు



కొండలరావుతో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

జామి, న్యూస్‌టుడే: మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు సోమవారం వైకాపా నుంచి తెదేపాలోకి చేరాయి. గజపతినగరం నియోజకవర్గ నాయకుడు కొండపల్లి కొండలరావు ఆధ్వర్యంలో గ్రామ నాయకులు ఎస్.సత్యనారాయణ, ఎస్.రామకృష్ణ, ఎన్.అప్పలనాయుడు, ఎ.అప్పారావు సమక్షంలో పి.శ్రీనివాసరావు, పిల్ల శ్రీనివాసరావు పార్టీ కండువాలు వేసుకొన్నారు. మండలాధ్యక్షుడు పి.స్వామినాయుడు, కె.సూర్యారావు, డి.పైడిరాజు పాల్గొన్నారు.

విద్యా,వసతి దీవెనలు విడుదల చేయాలి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: కళాశాలల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతి దీవెనలు విడుదల చేయాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఎటువంటి షరతులు లేకుండా పరీక్ష ఫీజులు కట్టించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, వెంకటేష్, సహాయ కార్యదర్శులు జగదీశ్, శిరీష, రమేష్, కమిటీ నాయకులు రాజు, గుణ, తేజ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఉప ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ



మంత్రి, ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న ఉత్తరాంధ్ర విద్యార్థి సేన నాయకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పర్యటనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యేలకు వినతులు అందజేశారు.

❖ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్సిటీలకు ఉత్తరాంధ్ర ఆచార్యులనే ఉప కులపతులుగా నియమించాలని విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు డా.సుంకరి రమణమూర్తి డిమాండు చేశారు. దీనివల్ల నియామకాలు, ప్రవేశాల్లో న్యాయం జరుగుతుందని, విద్యపరంగా ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు.

❖ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్తులో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు కోరారు. జీవో నంబరు 377 కింద 2020లో నియమితులైన తమకు రెండున్నరేళ్ల తర్వాత తొలగిస్తూ ఉత్తర్వులిచ్చారని పేర్కొన్నారు. దీనిపై న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ తమను అధికారులు ఏటా తొలగిస్తూనే వస్తున్నారని డి.రామయ్యమ్మ, పి.భారతి, ఎన్.పార్వతి, జి.కొండమ్మ, ఎ.ఎరకయ్యమ్మ తెలిపారు.



కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేసేందుకు వచ్చిన ఏపీవీవీపీ స్టాఫ్‌నర్సులు

❖ గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఆరోగ్య కార్యదర్శులను వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి తేవాలని (ఉషా) నాయకులు ఎ.మాధవి, బి.ప్రభారాణి, జి.సంధ్యారాణి ఆధ్వర్యంలో పలువురు కార్యదర్శులు కోరారు. ఎంపీహెచ్‌ఏలుగా పదోన్నతులు కల్పించాలని, శాఖాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతిలో పేర్కొన్నారు.

పింఛను కోసం అర్జీ అందజేత

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ జీవో ప్రకారం తనకు రూ.15 వేలు పింఛను మంజూరు చేయాలని కోరుతూ మొయిదకు చెందిన దివ్యాంగురాలు బి.రమాదేవి ఉప ముఖ్యమంత్రికి నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రి వద్ద వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం రూ.6 వేలు పింఛను మాత్రమే అందుతోందని, సదరం ధ్రువపత్రంలో తనకు 90శాతంపైగా అంగవైకల్యం ఉందని చెప్పారు.



అర్జీను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్

జిల్లాపై ప్రత్యేక దృష్టి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జనసేన నాయకులు అవనాపు విక్రమ్, భావన కోరారు. కలెక్టరేట్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా వెనుకబాటు తనాన్ని రూపుమాపాలన్నారు.



పవన్ కల్యాణ్‌తో అవనాపు విక్రమ్, భావన

సీటీయూ వార్తపత్రిక తొలి సంచిక ఆవిష్కరణ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూ) అధికార వార్తా పత్రిక ధిమ్సా తొలి సంచికను సోమవారం ఉపకులపతి కట్టీమని ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ విజయాలు, విద్యార్థుల ప్రగతి, సాంస్కృతిక వైవిధ్యానికి వేదికగా నిలుస్తుందన్నారు. రిజిస్ట్రార్ శ్రీనివాసన్, ఆచార్యులు కివడే, శరశ్చంద్రబాబు, జితేంద్ర మోహన్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



సంచికతో ఉప కులపతి కట్టీమని తదితరులు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తాం

పూసపాటిరేగ/భోగాపురం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు పేర్కొన్నారు. సోమవారం పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భోగాపురం, ముంజేరు, రామచంద్రపేట, ముక్కాం, తూడెం, రెడ్డి కంచేరు, రావాడ పాఠశాలల్లో ప్రచారం చేశారు. సీపీఎస్ రద్దు చేయడానికి కృషి చేస్తామని, అన్ని క్యాడర్లలో పదోన్నతులు, పీఆర్‌సీ తీసుకొస్తామని వెల్లడించారు. జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీనివాసుల నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

సంక్షిప్త సమాచారం

జూట్ మిల్లు సమస్యలు పరిష్కరించాలి

గుర్ల, చీపురుపల్లి: నెల్లిమర్ల జూట్ మిల్లు కార్మికులకు యాజమాన్యం పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదని సిటు నాయకుడు కె.రామారావు ఉప ముఖ్యమంత్రి పవన్‌కు వినతిపత్రం అందజేశారు. మిల్లును ఎప్పటికప్పుడు మూసివేస్తుండటంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు.

తుపానుతో అప్రమత్తత

లక్కవరపుకోట: భారీ వర్షాలకు ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురవకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధం ఉండాలని తహసీల్దారు ప్రసాదరావు తెలిపారు. వీఆర్వోలతో సమావేశమై వర్షాలు కురుస్తున్న సమయంలో సిబ్బంది తీసుకోవాల్సి జాగ్రత్తలపై సూచనలు చేశారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

డెంకాడ: డెంకాడ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, గునుపూరుపేట గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి.అప్పలస్వామి నాయుడు తెలిపారు.

25 వినతుల స్వీకరణ

వేపాడ: పెద గుడిపాల రెవెన్యూలో నిర్వహించిన గ్రామసభలో 25 వినతులు స్వీకరించినట్లు ఉప తహసీల్దారు సన్యాసినాయుడు సోమవారం తెలిపారు. ఉమ్మడి పట్టా విడదీయడానికి 10, విస్తీర్ణంలో తేడాలపై 5, మ్యుటేషన్ కోసం 5, వ్యక్తిగత సమాచారం నమోదుతో తప్పుల సవరణకు 5 వచ్చాయన్నారు.

నిధుల మంజూరుకు వినతి

వేపాడ: సింగరాయి ఎస్సీ కాలనీకి చుట్టూ రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టరు అంబేడ్కర్‌ను కోరారు. కాలనీ చుట్టూ చెరువు ఉండడంతో నీటి ఊటలతో ఇక్కట్లు పడాల్సి వస్తోందన్నారు.

జనసేన మండలాధ్యక్షుడి ఎంపిక

శృంగవరపుకోట: పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి కార్యాచరణ చేపట్టారు. మండలాధ్యక్షుడిగా తాండ్రంగి ప్రసాదు, ఉపాధ్యక్షుడిగా పత్రాన రవి, పట్టణాధ్యక్షుడిగా చిన్ని, ఉపాధ్యక్షుడిగా దేముడులను నియమించారు.

రెండు ఆలయాల్లో చోరీ

శృంగవరపుకోట: గత్రాజులోని పైడితల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు వెండి హారం, ఆంజనేయస్వామి హుండీ పగులకొట్టి నగదును అపహరించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు విజయనగరం నుంచి క్లూస్ టీం వచ్చి వేలి ముద్రలు సేకరించింది. కేసు నమోదు చేశామని సీఐ వి.నారాయణమూర్తి తెలిపారు.

నిందితుడి అరెస్టు

నెల్లిమర్ల: దేవునినెలివాడలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఈ నెల 14న చోరీకి పాల్పడిన నిందితుడు ఐ.గౌరీప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆలయ ఉత్సవమూర్తులకు చెందిన 10 గ్రాముల రెండు వెండి కిరీటాలు, రూ.3 వేల నగదు అపహరించినట్లు నిర్వాహకులు ఫిర్యాదు చేశారు.

సెపక్ తక్రా పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాలో ఈనెల 22 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులు సోమవారం పయనమయ్యారు. వీరిని ఒలింపిక్ అసోసియేషన్ నాయకులు గురాన అయ్యలు, సీహెచ్.వేణుగోపాలరావు అభినందించారు. సెపక్‌తక్రా కార్యదర్శి వై.రాజేష్, సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, శిక్షకురాలు జీవీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



ప్రధానోపాధ్యాయులు, పీఈటీతో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే : మండలంలోని వెంకటరమణపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లనున్నారని ప్రధానోపాధ్యాయురాలు కె.లక్ష్మి తెలిపారు. పి.రోహిత్, ఈ.కుమారి, ఎం.లహరి, డి.శ్యామ్, యు.కుసుమ వాణి, ఎ.గీతాంజలి, కె.బంగారులక్ష్మి, ఎస్.శరణ్య, సాయికృష్ణ, ఎం.కార్తీక్ ఎంపికయ్యారని చెప్పారు. వీరందరూ త్వరలో వివిధ జిల్లాల్లో జరిగే టోర్నమెంట్లలో పాల్గొంటారని వెల్లడించారు.

నేడు రాజగిరిమాత, బంగారమ్మ తల్లి జాతర

విజయనగరం ఉడాకాలనీ: ఉడాకాలనీ ఫేజ్-3లో కొలువుదీరిన పాత దుప్పాడ గ్రామ దేవతలు రాజగిరి మాత, బంగారమ్మ తల్లి జాతర ఉత్సవం మంగళవారం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పైడితల్లి అమ్మవారి పండగ తర్వాత వచ్చే మంగళవారం ఈ అమ్మవార్ల జాతర చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఘటాలు, విద్యుత్తు దీపాలంకరణ, పులివేషాలు, విచిత్ర వేషధారణలతో జాతర ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ సేవాసంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.వి.రమణ, కె.ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.



సమస్యల పరిష్కారానికి చర్యలు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగర పాలక సంస్థలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య స్పష్టం చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వినతులను స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి చెందిన ఐదు, ఇంజినీరింగ్‌కు సంబంధించిన రెండు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.



అర్జీదారుతో మాట్లాడుతున్న కమిషనర్

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: చంద్రబాబు పాలనలో పల్లె, పట్టణాల్లో నిరంతరం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతాయని, ప్రజలందరూ ఆనందంగా ఉంటారని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. సోమవారం మండలంలోని కొండకరకం, ద్వారపూడి, గుంకలాం, జొన్నవలస, దుప్పాడలో 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు రికార్డు స్థాయిలో సామాజిక పింఛన్లు అందిస్తున్న తమ ప్రభుత్వానికే దక్కుతుందని వివరించారు. ఎంపీడీవో చంద్రకళ, నాయకులు నర్సింగరావు, రాజేష్‌బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న అదితిగజపతిరాజు

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

డెంకాడ, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు రఘుమండ జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ క్రీడల్లో భాగంగా అండర్-14, 17 పోటీలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ప్రారంభించారు. క్రీడలతో పిల్లలకు శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని ఆయన తెలిపారు. ఎంపీపీ బి.వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, స్థానిక సర్పంచి జి.విష్ణు, ఎంపీటీసీ సభ్యుడు ముసలినాయుడు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు

వాలంటీర్ల భవితకు భరోసా కల్పించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వాలంటీర్లు, నాయకులు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: అసెంబ్లీ సమావేశాల్లో వాలంటీర్ల ఉద్యోగాలు కొనసాగిస్తామని తీర్మానం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వాలంటీర్లు ధర్నా చేపట్టారు. వాలంటీర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రంగరాజు, వాలంటీర్ల సంఘ నాయకులు రవీంద్ర, అచ్యుతకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పూసపాటిరేగ(భోగాపురం), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన భోగాపురం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై పాపారావు వివరాల మేరకు.. సోమవారం విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి భోగాపురం మండలం సుందరపేట వద్ద జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో విజయనగరంలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్విచక్ర వాహనాన్ని పరిశీలించినా వివరాలు లభ్యం కాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిస్తే మృతుల కుటుంబ సభ్యులు తమను సంప్రదించాలని కోరారు.